

# అడ్డుగోడలు

రుద్రాభట్ల నరసింగరావు

పుల్లంరాజుగారి పొలం మీదుగా కాలవగట్టే ఇంటికివస్తున్నాను. ఆయనతమ్ముడుఇటికల పొయ్యిమీద పెద్ద గిన్నెతో కూలీల కోసం టీ కాచుతున్నాడు. పొలంలో రంగురంగుల కోక లున్నాయి.

రంగమ్మ పుల్లంరాజుగారి దాపున నుంచుని వుంది.

'రండి డాక్టరుగారూ 'కాఫీ పుచ్చుకోండి'అన్నా రాయన నన్ను పలకరిస్తూ.

సైకిలాపి కాలునేలమీద ఆనుతూ 'అబ్బే వద్దండీ' అన్నాను.

రంగమ్మ గ్లాసులో పోశారాయన కాఫీ. మరచెంబు పక్కన పెట్టుకున్నారు. చల్లారేక అంతకాఫీ మూడుగుక్కల్లో తాగెయ్యడం ఆయన అలవాటు.

కోత కొచ్చిన చేనులా వంగుని రంగమ్మ కాఫీ అందుకుంటూ ఉంటే, పొలంలో పడుచులిద్దరు బుజాలు పొడుచుకుని ముసిముసిగా నవ్వుకున్నారు.

కాఫీ తాగేసి రంగమ్మను చూస్తూ గుటకలు వేశారు పుల్లంరాజుగారు. ఆయన వెనుకటి దృఢ కాయులు నిలబెట్టిన తమ ప్రతినిధి తాలూకు శిలా ప్రతిమలా ఉంటారు. ఖద్దరు సిల్కు చొక్కా పట్టివున్న ఆయన చాతీ చలవరాతిపలకే. చదరపునుదురూ నరళరేఖల్లాంటి కనుబొమల కింద లోతుగా ఉండి తీక్షణంగా చూసే కళ్ళు, మైదానంలాంటి ఆయువజీవితం కింద ఏవో అఖాతాలు ఉన్నట్టు స్పురింపజేస్తాయి.

ఇంతమనిషి, అసహజమైన మార్దవంతో, స్త్రీ ముందు వంకర్లు పోతారు.

రంగమ్మపై ఆయన చూపించిన ప్రత్యేకాభిమానానికి దాని ఆకృతే వ్యాఖ్యానం.

రంగమ్మసొత్తయిన శ్రామికుల శరీరపు బిగువులో ముస్లింస్త్రీల సౌకుమార్యం ఒదిగిపోయింది. ఒత్తుగా నొక్కులజుట్టూ, త్రివేణి సంగమంలా ఒదులుగా జడ. గోచీకట్టు లంగా, జాకెట్టులో జారిపోక నిక్కిమనల్ని వెక్కిరించే వయసూ—ఇవన్నీ ఒక్క చూపులో, కాఫీ కంటె వేగంగా, తాగేద్దాం అని పుల్లంరాజుగారు భ్రమ పడతారు.

నా భావం కనిపెట్టి ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తూ పుల్లంరాజుగారు 'రేపు రంగం నుంచి రంగమ్మ మొగుడొస్తున్నాడండోయ్.' అన్నారు.

సిగ్గుపడుతుందనుకున్న రంగి మొహంలో విచారం తొంగిచూడగానే వింత పడ్డాను. వెంకడు బర్మాలో బోలెడు గడిస్తున్నాడు. కాని ప్రభుత్వం పరిమితం చేసిన మేరకయినా డబ్బు పంపేవాడు కాదు. పుల్లంరాజుగార్తి ఇంటి కెదురుగా కాలవ అవతల లంకల్లో ఓ గుడిసె వేసుకొని ఒంటరిగా బతుకుతోంది రంగి. మొగుడు వస్తూంటే మరి ఈ దిగులేమిటో నాకు అర్థంకాలేదు.

'వెళ్లొస్తానండి.,

'అయి, వెళ్ళిరండి.'

పెడలు మీద కాలుంచి సైకిలుని పోనిచ్చాను.

ఈ వూళ్లో క్షత్రియుల లోగిళ్లు ఎక్కువ. నేను వూరు రాగానే ఎంతో ఆదరించినదీ వీరే. పుల్లంరాజుగారు తమ యింటి వెనుక భాగంలో తోటవైపు ప్రశాంతంగా ఉండే వాటా నాకు బసగా యిచ్చారు. అనుపత్రిపెట్టుకునేందుకు వెంకటపతిరాజుగారు డాబా యిచ్చేరు.

అన్నీ బాగానే వున్నాయి. వచ్చిన కొత్తలో ఒక్కటే చింత నాకు. —నారాకతో ఇక్కడి డాక్టరు ప్రాక్టీసుపడిపోయింది. నిపుణుడే మళ్ళీ. అతను.

నా వాటా గడపలో బంగారమ్మగారు కన బడ్డారు. నా కోసం ఎదురు చూస్తుండడం నాకా శ్చర్యం కలిగించింది. వారిమొగాళ్ళ దగ్గరే తప్ప ఇతర్ల దగ్గరవారికి ఘోషా లేకపోయినా, మేమిది వరకు ఎక్కువగా మాట్లాడుకోలేదు.

బొత్తిగా సన్నంగా ఉంటారు బంగారమ్మ గారు. అయితే, ఆవిడ చర్మం కింది ఎముకలు పట్టుగుడ్డలో చుట్టిన పూలమాలలు కావుగదా అని భ్రమింపజేసేటంత కోమలంగా ఉంటారు. వయసులో నా కంటే చిన్న. పాతికేళ్ల లోపుంటా రేమో.

'ఎందాక వెళ్లొస్తున్నారండి శర్మగారూ?' అని పలకరించారావిడ గారు.

ఈ వూళ్లో ఈ వృత్తిని మరపించేది ఈవిడ ఒక్కరే.'వూరికే అలా.....' అని అర్థోక్తిగా వది లేశాను—దీనికి ఆవిడకి సమాధానం అక్కరలేదు గనుక.

'అలా చిక్కిపోతున్నారేంటండి? మా వూరు నీళ్ల పడ్లేదా?'

నవ్వి వూరుకున్నాను.

'ఆయనా ఇలాగే ఎండిపోతున్నారు.'

పుల్లంరాజుగారు 'ఎండిపోతున్నా' రనే అను మానం ఏకోశానా లేదు నాకు. అయినా 'అవును అవును. బలానికి మందు రాసిమ్మంటారా?' అన్నాను.

'ఛ. మందులూ మాకులూ ఎందుకండి రాయిలా ఉన్నమనిషికి?' అన్నారావిడ.

వచ్చాం.'ఎండిపోతున్న రాయి'కి చికిత్సేమిటి? ఏమిటి మరి? డాక్టరుగా నా సలహా పొందుదామని రాలేదనీ,తోటి మానవుడికేదో ఆవిడ తన కష్ట సుఖం చెప్పుకుందుకు వచ్చారనీ స్పష్టమైంది.

'బొత్తిగా తిండి తగ్గించేశారండీ, శర్మ గారూ. కాఫీచుక్కయినా కడుపులో పడనివ్వరు. మరచెంబుడు చిక్కటి కాఫీ నేను కలిపి ప్రత్యే కంగా పంపిస్తే తనుతాగేది ఓ గుక్కెడు కూడా ఉండదు.'

'అవును ఇవ్వాళ రంగమ్మకిచ్చేశారు. కాఫీ' అనేశాను చిన్న కుర్రాడిలా.

బంగారమ్మగారి మొహంలో సంతోషం మెరి సింది. కాని ఆ మెరుపు వెనుక బ్రహ్మాండమైన మేఘం. పరిశోధన ఫలించిందని పొంగిపోయే శాస్త్రజ్ఞులు తన పరిశోధన ఫలితం వినాశానికి పని కొస్తుందిగదా అని గ్రహించి బాధ పడుతున్నట్లు.

తాఫీగా అన్నారావిడ. 'చూశారా మరి? నాకు తెలుసు—ఆ మనిషి పాడై పోతున్నారని. మీరు కనిపెట్టి వుండాలి శర్మగారూ ఆయన్ని.'

పట్నంలోలా కాక పల్లె పెట్టెలో ప్రతివ్యక్తి ఓ చిన్న అరలో బంధించుకుంటాడు తనని. కాని అందరి జీవిత విశేషాలు నీళ్ళయి అరలకింద పాకి అందరికీ వెల్లడవుతాయి.

అందుకే పట్నవాసున్నయిన నాకు పుల్లంరాజు గారు రంగి భర్త వూసెత్తగానేదానిమొహంలోనికి విచారం ఎందుకు తోసుకొచ్చిందో, 'ఆమనిషి' పాడై పోతున్నారని నాతో చెప్పడంలో బంగారమ్మ గారి ఆంతర్యం ఏమిటో మొదలయిన విషయాలు అర్థం కావు.

అయితే చేతి నిండా పని వుంది నాకు. ఇలాటి సోమరి కుతూహలాలు అట్టే కాలం నిలవవు. వీటి మీద తెర దిగి పోయింది. ఒక రాత్రి బంగారమ్మ గారే ఎత్తారు మళ్ళీదాన్ని.

నిద్ర పట్టక వీధి వైపు వచ్చాను. గుమ్మంలో ఎవరో ఉన్నారు.

'ఎవరూ బంగారమ్మగారా?'

'అయ్యే.' అన్నారావిడ'.

'నిద్ర పట్టడంలేదా? చాలా బలహీనంగా ఉన్నట్టున్నారు. రేపోసారి తనిఖీ చేస్తానుండండి. సిరిమాల్ట్ ఓసీసా పుచ్చుకోండి' అని ఉచిత వైద్య సలహా యిచ్చాను. వెంటనే సిగ్గు పడ్డాను.— ఆవిడ మొహం పై చిరునవ్వు మెరిసినట్టు అను మానం తోసింది.

'రాజుగారేరి?'

'ఏమో బాబూ,వూళ్లో కిట్టనివెధవలకయినా తన రహస్యాలు చెప్పుకుంటారు గాని—' అన బోయి 'ఆ పాట విన్నారా?' అంటూ మాట తప్పించారు.

బుల్ బుల్ తారాపై పాటనవ్వగా, జాలిగా కాలువ అవతల తోటల్లోంచి విన వస్తోంది.

'ఎవరూ పాడుతున్నది?'


'ఇంకెవరు రంగి మొగుడు వెంకడు లేడూ, రంగం నుంచి రోగంతో తిరిగొచ్చాడు, వాడే. ఆర్నెల్లనుంచి చూస్తున్నాను. వినే వాళ్ళకి ఏడు పొచ్చేలా వాయిస్తూ అలా పడుకుంటాడు. వాడు మంచంలో ఉన్నంతకాలం మొగాళ్ళకి గంగ వెర్రులెత్తిస్తూనే ఉంటుంది రంగి. మావని ఇలా కళ్ళ కాయలు కాచేలా చూడ్డం, వళ్ళ హూనమయేలా దెబ్బలు తినడం—ఆః డాక్టరు గారూ మీరోసారి వెంకణ్ణి చూసిరండి బాబూ.' అని ఏమో చెప్పడానికి తడుముకుంటున్నారు బంగా రమ్మగారు.

ఇంటిగుట్టు కాపాడుకోవాలని ఆవిడ ఎంతగా తంటాలు పడుతున్నా ఓ మూల కడుపులో బాధ దాగడం లేదని గ్రహించాను—తూము తలుపుల పైనుంచి తోసుకు ప్రవహించే నీటిలాటి బాధ.

ఇక రంగిపై ఆవిడ చేసిన ఆరోపణ నబబుగా కనిపించలేదు. నాకు తెలిసినంతవరకు రంగి నిప్పు లాంటిది. అయితే బతుకు తెరువు ఆమె శీలం పాలిటి ఉరిగా మారి బిగిసిపోయిందేమో చెప్ప లేము.

బల్ల కట్టుమీద ఈవలి ఒడ్డుకు వస్తూన్నా డొకవ్యక్తి.





బెంగుళూరు విధానసౌధ — జి. వి. సత్యం

'మీకు పుణ్యం ఉంటుంది శర్మగారూ. వాణ్ని చూడండి. ఖర్చు విషయం నాతో చెప్పండి—' అంటూ ఆగి పోయారు బంగారమ్మగారు. భర్త రాక గమనించి తలుపుచాటుకి వెళ్లారు.

నన్ను అప్పుడు అక్కడ చూసి పుల్లంరాజు గారు కొంచెం ఇబ్బంది పడ్డట్టున్నారు.

మాయిద్దరి మధ్య అక్కరలేని సంభాషణ నడవడం, నేను సెలవు తీసుకోడం జరిగాయి.

గదిలో పడుకున్నాను. పుల్లంరాజుగారి భాగం లోంచి నోట కుక్కుకుంటున్నట్టు సన్నని ఏడ్పు ముక్కలుగా వినిపించింది. నాకు తెలియకుండానే ఏ ఘోరానికో సాక్షినిగాని, కర్తనిగాని అవుతున్నానా అని అనుమానం వేసింది.

వెంకడి గురించి పట్టించుకోకూడదను కున్నాను. కాని మరోసారి బంగారమ్మగారొచ్చి గట్టిగా చెప్పి, ఒకవిధంగా బలిమాలి మందు ఖర్చు ఉంచమని ఓ డబ్బిలోని వంద రూపాయలచిల్లర నా ముందు పోశారు.

'రాజుగారికి తెలియనివ్వకండేం ఈ సంగతి' అన్నారు.

తన దగ్గర డబ్బున్న సంగతి పుల్లంరాజుగారికి తెలియ కూడదని కాదు ఆవిడ భయం. చాటుగా బియ్యమూ, దొడ్లో పండూ, కాయా అమ్మి తమ ఆడవాళ్ళునిలవచెయ్యడం ఇక్కడి మొగాళ్ళందరూ ఎరుగుదురు. కాగా, బంగారమ్మగారి భయం వెంకడికి తాము సాయం చేస్తున్నట్టు భర్తకి తెలియకూడదని.

'ఆ మనిషిలో ఈ మధ్య దయాదాక్షిణ్యాలు బొత్తిగా తగ్గి పోయాయి శర్మగారూ.'

పుత్తడి బొమ్మలా నుంచున్న ఆవిడ రెప్ప పాటులేని కళ్ళలో వెంకడిపై కరుణకంటె తన మీద తాను పడుతున్న జాలే ఎక్కువగా కన బడింది, నాకు. వాటిలో అనూయ ఎక్కడో మినుకు మినుకుమంటున్నా దాన్ని పోల్చడం ఇష్టం లేకపోయింది అప్పట్లో.

మరునాడు వెంకడు ఇంటికి వెళ్ళాను.

రంగి వూ తడబడి పోతూనన్నాహ్వానించింది. పరీక్ష పూర్తిచేసి ఓయింజక్షనిచ్చిమవునంగా బయటికి వచ్చాను.

ఏదో ఆశ పీకుతూ ఉండగా రంగి నన్ను వెంబ డిస్తున్నట్టు కనిపెట్టి 'స్వదేశంలో చక్కని చుక్కలాటి పెళ్ళాం ఉండగా వాడికీ పాడు బుద్ది లెందుకు కలిగినట్టు' అన్నాను, స్వాముల వారిని కానన్న సంగతి మరిచి.

'ఆ వూసెప్పుడూ ఎత్తకండి బాబూ ఆడికాడ. అనలే కుమిలి పోతా వుండాడు. "నాకు వొయిజ్జం ఎందుకే రంగీ, సేసిన పాపాలకి సిచ్చ అనబవిం చెయ్యాలి" అంటున్నాడు. దేశంకాని దేశంలో పొగలల్లా రెక్కలు ముక్కలు సేసుకుని గడించే వోడికి రేత్తిళ్ళ ఆ పాటి సుకం లేకపోతే....' అంటూ లజ్జ చేత మరి మాటాడ లేకపోయింది.

గుగుర్పాటు కలిగింది నాకు. రంగి వంక సాశ్చ ర్యంగా చూస్తూ ఉండిపోయాను. ఇప్పుడామె అందపు బిగువూ తళుకూ మునపటిలా రాతిలో మలచిన శిల్ప సుందరిని తలపింప చెయ్యలేదు. సున్నితమైన హృదయాన్ని పూలరాశిలో పదిల పరిచి పైన మొఖమల్ కప్పికట్టిన పార్సెల్‌లా ఉందామె.

'ఆతల్లి దయవోల్లా, తమ సేతి సలవ్వల్లా ఆడుమళ్ళీ లెగిసి తిరిగితే ముత్తేలమ్మ గుడికెల్లి'

మరేం ఫర్వాలేదులే.' అని ధైర్యం చెప్పి బల్ల కట్టు ఎక్కాను.

వెంకడికి నేను వైద్యం చెయ్యడం, బంగారమ్మ గారి ఆర్థిక సాయంగురించీ వూరంతా పాకడానికి ఎంతో కాలం పట్టలేదు.

ఒక సాయంకాలం పుల్లంరాజుగారొచ్చి 'అలా వెళదాం రండి' అన్నారు. మాట్లాడవలసిందేమో ఉంటుంది.


బయలుదేరాను.

కొబ్బరి తోటల్లో నడుస్తున్నాం.

పొగాకు పాయ సాపు చేస్తూ 'వెంకడికి నయం అవుతుందంటారా?' అన్నారు.

'అవకేం?'

జవాబుల్లాంటి ఎదురు ప్రశ్నలు పుల్లంరాజుగా రికినచ్చవు.



వేణుగోపాలస్వామి దేవళం (గద్వాల) — జి.వి. సత్యం

'అవదు. వృథా శ్రమ పడకండి.'

విస్మయంతో ఆయన గంభీరమైన ముఖం లోనికి చూశాను. అక్కడ ఆయన ఆలోచనలు తెల్ల లోని చారలలా అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

మౌనం శ్రేయస్కర మనిపించింది నాకు.

కొన కొరికి చుట్ట వెలిగిస్తూ 'వెంకణ్ణి వాడి ఖర్మానికి వాణ్ణి వదిలెయ్యండి.' అన్నారు పుల్లం రాజుగారు.

జబ్బు తగ్గ ముఖం పట్టే నప్పుడా?'

చుట్టతీసి తుపుక్కున ఉమ్మేస్తూ 'జబ్బు సంగతి అలా వదిలి మీరు వాడి వైద్యం చెయ్యడం మానుకోండి అంతే.' అన్నారు.

ఈ శాసింపుతో నాకు కష్టం తోచింది.

'పాపం. రంగమ్మ—'

'రంగి సంగనాచి అని మీ వూహ! అంతేనా?'

'రంగమ్మ అమాయకురాలు కాకపోయినా నేనాశ్చర్య పడను.' అన్నాను దృఢంగా.

'అమీబాలాటిది వ్యక్తి ప్రవర్తన. అవస రాన్ని, అనుసరించి ఆకారాన్ని మార్చుకుంటుంది. సంఘం పై ప్రకాశాను కింద నిర్లక్ష్యమైన విద్యార్థుల్లాంటి లోకులు ఒక వ్యక్తి ప్రవర్తనని ఆదర బాదరగా చూసేసినంత మాత్రాన దాని గురించి సమగ్రమైన రికార్డు తయారు చెయ్యలేరు.' అనుకుంటూ పుల్లంరాజుగారితో ఇలా అన్నాను.

'మీరన్నదే ఒప్పుకున్నా రంగమ్మ ఘోరమైన తప్పేంచెయ్యలేదనే అంటాను. భర్త అప్పుల్లో మునిగి వున్నప్పుడు తన నగలన్నీ వలిచియిచ్చిన స్త్రీ జీవితం తెరకెక్కుతుంది. స్త్రీకి ఉండే ఒకే ఒక్కనగనీ మొగుడి కడుపునింపి రోగం మాన్పి దక్కించుకునేందుకు త్యాగం చేసిన రంగిలాటి దాని బతుకు రచ్చ కెక్కుతుంది.'

ఈ మాటల్ని నేనెంత నెమ్మదిగా అన్నా పుల్లం రాజుగారికి వాటిలో ఆవేశం కనబడి నట్టుంది. మౌనవం వహించారు.

పడమట మేఘం కొండలా నిలబడి వుంది. అక్కడక్కడా పువ్వులున్న జనపచేలలో గట్ల మీద ఎగ గట్టిన పసుపు పచ్చని కోకతో, చేత టిఫిన్ కారియర్‌తో, ఆకాశంలో చందమామలా, పరుగెత్తుతోంది రంగమ్మ, మధ్య మధ్య ఆగి నడుస్తూ.

ఆ సౌందర్యాన్ని చూపులతో వెంబడిస్తున్నాను.

'చదువూ, సంస్కారాల కటకటాలవెనక ఉండి పోయారు గాని చాలా మంది, లేకపోతే ఎవరు మాత్రం రంగిని మింగికుండా ఉంటారు?'

ఉలికి పడ్డాను. అనవసరమే. ఇది ప్రశ్నకాదు. నన్ను ఎత్తి పొడవడం అంతకంటే కాదు. తాను చేస్తున్నపనికి పుల్లం రాజుగారు చెప్పుకునే సంజాయిషీ, ఓరకమైన క్షమాపణ అది.

నేను కొంచెం నవ్వుతూ 'మీరూ సంస్కారం కటకటాల వెనక్కి వెళ్ళి అందర్నీ నక్షత్రాలా చూస్తే అందరికీ హాయి గదా? ముఖ్యంగా బంగారమ్మగారెంతో—' అనబోయాను.

నన్ను తుంచేస్తూ 'ఇంటి విషయాల జోలికి పోకండి. ఇంతకీ మీరు వైద్యం చెయ్యడం మానరన్న మాటేగా వెంకడికీ?' అని జవాబు కోసం ఆగక 'సరే అలా వెళ్ళొస్తాను' అంటూ వెళ్ళిపోయారు పుల్లంరాజుగారు.

సంక్రాంతి. స్నానం చేసి నా గదిలో తీరికగా కూర్చున్నాను. ఏవో జ్ఞాపకాలతో బరువుగా వుంది హృదయం. అమ్మా శోభా వాళ్ళూ ఏం చేస్తూ ఉంటారో ఇప్పుడు......కిటికీ లోంచి లేత కిరణాలు నా మీద పడి వెచ్చగా కౌగిలించుకున్నాయి. ఎందుకో పసిపాప జ్ఞాపకం వచ్చి, యింకా ఈ లోకంలో అమాయకత్వం రూపుమాసిపోలేదు గదా! నా గుండె తేలికపడింది.

పాలేరొచ్చి బంగారమ్మగారు రమ్మంటున్నారన్నాడు. వెళ్ళాను.

వెండి పువ్వుల పీట వేసి కూర్చోమన్నారావిడ. లోపలికి వెళ్ళి వెండి పళ్ళెంలో పూత రేకు చుట్టలూ, పంచిపీళ్ళూ, కాఫీ పట్టుకొచ్చి నా ముందుంచుతూ 'భోంచెయ్యండి' అన్నారు.

'భోజనం మానండి— అనండి' అన్నాను నోరూరుతూండగా పూతరేకులు తింటూ.

'మరేం! ఈ ఒక్క ముక్కకే?'

ద్వారాన్ని ఆనుకుని ఆవిడ నా చూపుల్ని కట్టేశారు తనమీదనే.

అంచుల నున్న కాటుక ఆవిడ కళ్ళ నలుపు చూసి సిగ్గుపడి లోనికి పోసట్టుంది. లేత ఎరుపో, పసుపో చెప్పుకోలేని పట్టులాటి ముఖం కాంతి. పెదవి కదిపితే గులాబీపై మంచు బిందువు సూర్య కాంతిలో నవ్వినట్టే......'

నా ధ్యానాన్ని మరల్చడానికో అన్నట్టు "ఎలా వున్నాయి శర్మగారూ పూచ్చెట్లు?' అన్నారు.

నేను సిగ్గు పడి 'ఫస్టుగా వున్నాయి'అన్నాను.

తర్వాత ఏం మాట్లాడాలో ఎవరికీ తోచలేదు.

పాలేరు వాకిట్లోంచి కేకేశాడు 'అయ్యగోరు రంగికి బూర్లట్టు కెళ్ళమన్నారమ్మా.'

'ఎవర్నిరానెధవ కొడకా, నన్నా?'

'అయ్ రాము! నన్నండమ్మా.'

'చిత్రం' అని చిత్రంగా ముఖం వంకర చేసుకున్నారు, బంగారమ్మగారు.

ఇక్కడి స్త్రీలకి సహజమే అయినా మోటుగా మాట్లాడ్డం బంగారమ్మగారి కెందుకో తగదనిపించింది. అందమైన అపశ్రుతులు పలికినప్పటి దుఃఖం కలుగుతుంది నాకు.

నేను కాఫీ గ్లాసు నోటి దగ్గర పెట్టుకునేటప్పటికి 'మీరింక వెంకడికి వైద్యం చెయ్యకండి' న్నారావిడ.

అఎత్తిన గ్లాసు ఎత్తినట్టే ఉండి పోయింది. అయోమయంగా చూస్తూ కూర్చున్నాను.

కొంత సేపటికి ఆవిడే అన్నారు: 'పుణ్యానికి పోతే పాపం ఎదురవుతుంది. రోజురోజుకీ మీకు కొత్త చిక్కులు చుట్టు కుంటాయి.'

నా కంతా అర్థమై పోయింది. 'పిరికి మందు తిన్నవాడు వైద్యుడుగా పనికిరాడ' ని చెప్పి బోధ చేశాను ఆవిడకి.

వైద్యం మానమనడం ఆవిడకీ కష్టంగానే ఉన్నట్టుంది.ఆవిడ మాటల్లో ఏదో మార్దవం కనబడుతోంది. వెంకడి గురించి మొదట్లో నన్ను బతిమాలినప్పుడే బంగారమ్మగారికి వాడిపై జాలి ఉన్నట్టు తోచ లేదు.

'మొదట్లో ఏదో ప్రయోజనం ఆశించి ఆవిడ వాడికి వైద్యం చేయించడానికి పూనుకున్నారు. కాని క్రమంగా వాడిపై ఆవిడకి జాలీ, వాత్సల్యమూ పుట్టుకొచ్చాయి కాబోలు. ఇప్పుడు వాడిని వదిలి వెయ్యడం చెయ్య నరుక్కుంటున్నంతబాధగా ఉన్నా, నా క్షేమం ఆలోచించి...'

ఒక్కసారి ఉప్పొంగి పోయింది నా హృదయం మారు మూల ఈ దూర ప్రాంతంలో పండు తని మించిన ఆనందం!

నేను మట్టుకు వెంకడిని మరింత శ్రద్ధగా చూస్తున్నాను. 'వాడి మీద ప్రత్యేకాభిమానం కుదిరి కాదు, నన్ను బెదిరించే పరిస్థితుల మీద కసి తీర్చుకోవాలని.

ఓ రోజు వాడి గుడిసెలో అడుగు పెడుతూ వుంటే రంగి మాటలు వినిపించేయి.

'...తన పెనిమిటికీ నాకూ మద్దె విన్న ఉక్కు గోడల్లే నెగదియాలనీ బంగారమ్మగోరి ఉద్దేశం. నువ్వేవో అయున్నడ్డలేక సేతకాని పెద్దమ్మల్లే ఒల్ల కుండావు....'

'నానెందు కడ్డుతానేశ్' ఎవోరి బుద్ధాళ్ళ కుండాలి గాని!' అంటున్నాడు వెంకడు.

మరోనాడు బంగారమ్మగారు 'వెంకడికి పాపం నోరులేక పోవడంవల్ల అటు రంగి బతుకూ, ఇటు నా బతుకూ నాశనమవుతున్నాయి.'అన్నారు.

నేను తెలివి తక్కువగా 'మీరు రంగి గురించి ఎందుకింత బాధపడతారు.పుల్లంరాజుగారు మొన్న శ్రీ రామ నవమి ఉత్సవాల్లో తాంబూలం ఇవ్వడానికి వచ్చిన భోగందాన్ని పట్టుకుని 'అడ్రసిచ్చావు గాదేమే?" అనడి గారు.....' అన్నాను.

కాని నేను తెల్ల బోయేలా అన్నారు బంగారమ్మగారు:'ఆ మాట కొస్తే ఈ తాలూకా నిండా ఆయన చిలక్కొట్లు ఎన్నో!'

బంగారమ్మ గారి బాధల్లా భర్త హృదయంలోనే' తోటి ఆడది చోటు చేసుకున్నదని.

బంగారమ్మ గారిపై నా జాలి ఆపేక్షగా రూపొందుతోంది.

అయితే నాలో రాగద్వేషాలని పృథక్కరించి ఆయా వ్యక్తులపై ప్రసరింపజేసిన ఒక సంఘటన మాత్రం చెబుతాను.

ఒకరాత్రి బాగా అలిసిపోయి ఇల్లు చేరుకుంటున్నాను. ఈవర్షాకాలంలో ఉడుకువల్ల నీరసం చేసింది. చీకట్లో గట్టుమీద జాగ్రత్తగా పోనిస్తున్నాను సైకిలుని. టైర్ బర్స్టు అయింది. దిగి బండిని ఈడ్చుకొస్తున్నాను.

కొబ్బరితోటలో ఆకారాలు కదిలేయి. నావైపే వస్తున్నాయి. చెవిని దూసుకుపోయింది ఒకరాయి. ఇంకోటి వెంటనే నా నుదుటిని గాయపరిచింది. సైకిలు జారిపోయింది. నేను చక్రాల మీద కూలబడ్డాను.

కరెంట్ ఆగిపోయినప్పటి దీపాల్లా నా ఆలోచన లాగిపోయేయి. మెదడులో చీకటి. జ్ఞానేంద్రియాలు చచ్చిపోయేయి. ఎంతసేపటికో మొహంమీది రక్తపు వెచ్చదనం తెలిసింది. క్రమంగా మాటలు వినబడసాగేయి.

'బాబుగోరికి పేణం కడట్టపోతావుంటే ఇప్పుడు అంటరానితనమని సిందులు తొక్కుతావేంటే. లెగదియ్యి!'

ఈకసురు రంగిదని గుర్తించాను.

'అది కాదే —'

సంశయిస్తూ నామీదకు వంగాడు వెంకడు 'బాబూ'అని పిలిచి నన్ను లేవదీసి మెల్లిగా నడిపించసాగేడు.

'అన్నెం పున్నెం ఎరగరే. ఏయెదవ బాబూ ఇంత పాపానికి ఒడిగట్టాడు! ఆడికొంప కూలి జెల్లెళ్ళ మొలవకపోతే .... '

'వూరుకోయే రంగి.సెట్లకి సెవులుంటాయ్.'

'మువ్వలా పడుండరా పిరికినాయాల! రావుడు పెళ్ళాంకోసం రాచ్చసుల మీది కెళ్ళినాడు. బాబుగోర్ని అన్యాయంగా కొట్టినోడినోట్లో పురుగులు పడి .... '

ఇకదాన్ని ఆపడం బ్రహ్మతరం కాదని గ్రహించాన్నేను. ఆమె పలికేవి కేవలం నాపట్ల సానుభూతి వాక్యాలు మాత్రమే కావు. ద్రౌపదిమొంచి అనేక స్త్రీల హృదయాలని దగ్ధంచేస్తున్న అగ్ని యొక్క సెళసెళలు.

గది చేరుకున్నాం. సైకిలు చేరబెట్టింది గోడకి రంగి.

కట్టుకట్టుకుని పడుకున్నాను. ఎప్పుడు నిద్ర పట్టిందో ఎంతసేపు నిద్రపోయానో.

ముఖంమీద వెచ్చదనం. సూర్యోదయమవుతోంది కాబోలు మామూలుగా, అనుకున్నాను.

'అన్నయ్యగారూ. '

ఉలికిపడి కళ్ళువిప్పాను.

బంగారమ్మగారు!

తోబుట్టువులేని మందభాగ్యుణ్ణి,కలలోనైన ఆశించానా, ఈజన్మకింత కమ్మని పిలుపు వింటానని?

'బాధ ఎలావుంది?'

నేను తేరుకుని 'అబ్బే, ఎక్కువగా లేదండీ.' అన్నాను.

ఆవిడ చెయ్యితీసి ఓకుర్చీ మంచం దగ్గరగా వేసుకుని కూలబడుతూ 'నేనేం పాపం చేశానని చెప్పండి, దేవుడు నన్ను ఇన్నివిధాల దండిస్తున్నాడ.!' అన్నారు.

నా 'బాధ తనకి దండనా? 'అబ్బా! హృదయం ఆగి చచ్చిపోనుగద యీ ఆనందంతో!'

చాలాసేపు నిశ్శబ్దాన్ని మా మధ్య బంధించాయి, వేదనానందాలు.

'అసలు దేవుడనే వాడున్నాడంటారా అన్నయ్యగారూ?'

నాటినుంచీ నాకు తారసిల్లిన ప్రతివ్యక్తీ ఎప్పుడో ఒకప్పుడు, ముఖ్యంగా కష్టాలు చుట్టబెట్టినప్పుడు, ఈసంశయాన్ని వెలిబుచ్చగా వింటూనే ఉన్నాను. డాక్టర్నిగనుక, అంతకుమించి ఆలోచించలేదు.

బంగారమ్మగారు ఎక్కువ మాట్లాడలేదు. హార్లిక్సు కలిపి పంపించారు.

నీరసం కొంచెం తగ్గింది. మధ్యాహ్నం తోటల్లోంచి ఎండ వెచ్చదనం చల్లనిగాలీ అనుభవిస్తూ నడిచి పొలంగట్టు చేరుకున్నాను. పాలెండిన రొమ్ము పీల్చే పసివాడి బుగ్గలమీది నీడల్లా... ఆకుమళ్ళ సరస్సులు అలలు వేస్తున్నాయి. పసివారి సెట్లలా మేఘాలు వెనక్కివెనక్కి పోతున్నాయి. శ్రావణం వెళుతున్నా ఒక్క చినుకు రాలలేదు.

అదారి వెళుతున్న ఓకాపు నాచూపుల్లోని భావం పసిగట్టాడేమో 'పాపం నిండిపోనాది బూమ్మీద—వానదేవుడు జంకుతున్నాడందుకే.' అని చెప్పాడు.

నాపట్ల ఎంత అప్యాయత ఆ పలకరింపులో! పల్లీయులకి హృదయం ఉంది. దాన్ని

దచుకునేందుకు నాలికం కదలేదు. విశాలం చేసుకునేందుకు సంస్కారం లేదు.

ఆరాత్రి నిద్రపట్టక పొరికే పడుకున్నాను. ఓరాత్రప్పుడు హఠాత్తుగా సన్నని కేక వినబడింది. గభాలున లేచి కూర్చున్నాను. అది బంగారమ్మ గారి గొంతు. లేచి పరుగెత్తాను. వాళ్లభాగం వైపు. తలుపు తాం అని తీసుకుని వెళ్లిపోతున్న కర్కశమైన అడుగుల ధ్వని. బంగారమ్మగారి గదిలో చొరబడ్డాను.

పరుపుమీద బోర్లాపడి తీవ్రంగా మూల్గుతున్నారావిడ పక్కతెగరేస్తూ. ఓచెంబ్బు మెలి తిరిగిపోయి ఆవిడ వీపు మీద ఉంది. ఫిట్ అని గ్రహించాను. నెమ్మదిగా చెంబ్బు సరిచేసి వెల్లకిలా పడుకోబెట్టాను. పిట్టలా ఇమిడిపోతున్నారావిడ నాచేతుల్లో. ముఖం మీద నీళ్లుజల్లి చెదిరిపోయిన ముందరిజుట్టును సర్దుతున్నాను. వూడిపోయిన పొడుగాటి వెంట్రుకలు చూసి వణికిపోయాను.

పాలేరుని లేపి 'నా మందుల పెట్టితే!' అని కసిరాను.

వాడు పెట్టెతెచ్చి 'అయ్యగోరు కాస్తంత కన్నెర్ర జేసినప్పుడల్లా ఆయమ్మ ఇలా పడిపోడం మామోలే బాబూ.' అన్నాడు తను కంగారుపడి లేవకపోడానికి సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు.

బంగారమ్మగారికి హిస్టీరియా!

ఆవిడకి నెమ్మదిగా తెలివి వస్తూ ఉంటే గ్లూకోజు నీళ్లుకలిపి చెంచాతో పోశాను. చిన్నపిల్లలా మింగారు.

ఇంజక్షన్ తీశాను.

'నామీద రవంత అభిమానం మీకుంటే నాకు మందివ్వడానికి తంటాలుపడక ఇక్కణ్ణుంచి వెళ్లిపొండన్నయ్యగారూ.' అన్నారావిడ.

ఇలాటిమాట అనే పరిస్థితిలోనే బంగారమ్మగారు ఇరుక్కుని వున్నారని నాకు ముందే తెలుసు. ఇప్పుడావిడని ఆ ట్టే వాగించక బయటికి పోవడమే మంచిది.

ఆతర్వాతనైనా బంగారమ్మగారు నాకు కబురంపలేదు సరికదా, నాఅంతట నేను వెళ్తే గుమ్మంలోంచే పంపించేశారు, పని మనిషిచేత.

ఒకరాత్రి బాగా పొద్దుపోయేక తోటలోకి వెళ్లాను. బుల్‌బుల్‌తారాపై పాట వినిపించింది. వెంకడు గడ్డిమేటు నానుకుని వాయించుకుంటున్నాడు.

'ఇంతరాత్రప్పుడు ఇక్కడేవిటోయ్? పురుగూ పుట్రా తిరుగుతాయి.'

'ఆయి మన్నేం సేస్తాయి బాబూ. అయినా మనకి రోజూ రాత్రిక్కడేగా మకాం?' అన్నాడు వెంకడు.

'ఇంట్లో రంగికి తోడు?'

పెళ్లికూతురిలా సిగ్గు పడుతూ వూరుకున్నాడు వెంకడు.

'ఉక్కుకడ్డీలా తయారయావు. నీకేసిరికి తనం ఏవిటోయి? నీభార్యని నువ్వేలుకోటానికి అడ్డేవిటి?'

'అడ్డేంటి బాబూ, తలుసుకుంటే అడ్డు గోడం పలిట గడ్డపలుకవుద్ది మనసెంబ్బ. కాని —' అని తన భావాన్ని సరిగా వ్యక్తం చెయ్యలేక సన్ను కుంటుంన్నాడు వెంకడు.

కాని నాకర్థమై పోయింది వాడికి 'తలుసుగునే' నైతిక ధైర్యం లేదు.

పుల్లంరాజుగారు కనబడతారనిగానీ, కష్టపడి ఆయన దర్శనం చేసుకున్నా బంగారమ్మగారికి వైద్యం చెయ్యనిస్తారనీగానీ నాకు ఆశలేదు.

మనః స్థిమితం లేక వృత్తి ధర్మం సరిగా నెరవేర్చ లేక పోతున్నాను. ఎవరికైనా నిద్ర పట్టడానికి బ్రోమైడ్ ఇవ్వబోయి శాశ్వత నిద్రనిచ్చే సయనయిడ్ ఇవ్వను గదా అనుకునేంత అపనమ్మకం నా మీద నాకే కలుగుతోంది.

ప్రతీక్షణమూ పుల్లంరాజు గారింటి నుంచి కబురు కోసం ఎదురుచూస్తూ బతుకుతున్నాను.

కబుర్లయితే అందుతూనే ఉన్నాయి. కొష్టంలాటి నాబాధలో ఒక్కొక్క కర్రలా పడుతూ నానాటికీ బంగారమ్మగారు మృత్యువుకి ఎదురేగుతున్నారు.

మన స్పృహలో లేరట, ఓ నాడల్లా.

నిరాశ రసాతలంలో దించేసింది నన్ను.

హఠాత్తుగా ఓ నాటి సాయంకాలం, ఉరి పోసుకున్న ఆడదానిలా సూర్యుడు చెట్ల వెనక జారిపోయిన తర్వాత పుల్లంరాజుగారు నా దగ్గరకి పరుగెత్తుకొచ్చి 'మా ఆడ వాళ్ళని ఓ సారి చూస్తే తప్పుటయ్యా డాక్టరుగారూ?' అన్నారు నిష్ఠూరంగా.

'పుట్టినోజు పూటాబడికెందుకురా వెధవా?' అని తండ్రి కసిరినప్పటి పిల్లడిలా ఆనందంతో పొంగి పోయాను.

చొక్కా అయినా తొడుక్కోకుండా బంగారమ్మగారి గదికి పరుగెత్తాను—మందులపెట్టె పట్టుకుని.

మంచానికి అంటుకు పోయి వంటిమీద తెలివి లేకుండా ఉన్నారు బంగారమ్మగారు.

నాడి చూశాను. ఆవిడ వీపు మీద స్టెతస్కోపు ఉంచి పరీక్షించాను. 'అసలు నా బుర్ర పని చేస్తోందా?!'

పెట్టెలో తడుముకొని ఓఇంజక్షన్ తీసి ఇచ్చా. స్టెతస్కోపు బిళ్ళ అరచేతిలో కొట్టుకుంటూ కూర్చున్నాను.

'మరేం భయంలేదు గదండీ?'

'లేదనుకుని వెళ్ళండి మీ యిష్టంవచ్చిన చోటుకి. !' అని అరిచాను. పుల్లంరాజుగారు నా మాట హాలాహలంలా మింగి ఇముడ్చుకున్నారు.


పందెపు కోళ్ళూ, పొట్టేళ్లూ పౌరుషాన్ని పుల్లంరాజుగారి దగ్గరనేర్చుకుం గాయి. అలాటి నన్నుమౌనంతోక్షమించారంటే ఎంతతపిస్తోందో ఆయన హృదయం!

గబగబ మందులు రాసి ఆయన చేతిలో పెట్టాను చీటీ.

డబ్బు జేబులో కుక్కుకుని ఆవి తెచ్చి పడేశారు. అంతే బంగారమ్మగారి మంచం వదిలిపెట్టలేదు మరి.

శాయ శక్తులా ప్రయత్నించాను నేను. అయితే ఆవిడ కన్ను తెరవడం వరకే నాచేతిలో పని. భర్త సాన్నిధ్యం వల్లనే బతికి బయట పడ్డారు. బంగారమ్మ గారు.

పూర్తిగా కోలుకున్నారు కూడా.

కాని ఏం లాభం?

మరుసటి సంవత్సరమే కష్టపడి మొగబిడ్డని ప్రసవించి అసువులు వదిలారు బంగారమ్మగారు.

ఈ అఘాతంతో కుంగి పోయాన్నేను. అప్పటి నుంచీ సౌందర్యాన్ని చూసి కుమిలి పోతాను. వాతో దయగా మాట్లాడే వాళ్ళంటే భయపడతాను. కుక్కని పెంచడం బెదురుగానే ఉంది.

పుల్లంరాజుగారు బొత్తిగా కనిపించలేదు.

ఒకసారి ఆయనికి వంట్లో బాగులేదని కబు రొచ్చింది.

వెళ్ళాను. చూశాను. రెండు మాత్రలిచ్చాను.

ఆయన ఒడిలో బంగారమ్మగారి ఆకుపచ్చ చీర ఉంది.

'బంగారమ్మగారు మీ సుఖానికి అడ్డు అను కున్నారు. ఇప్పుడు హాయిగా ఉంది గదా మీకు.' అని ద్వేషాన్ని కక్కాను.

ఆయనకి కోపం రాలేదు. అదే వింత!

'నేను అడ్డు గోడలన్నీ కూలి పోయాయి. రైటే. [illegible] ఎదర కోతలయాక చేనులా కని పిస్తోంది బతుకు.' అన్నారు.

'మీ ప్రేమ విషం లాంటిది. అది బంగా రమ్మగారి మీద ఎందుకు కురిపించారు?'

గంభీరంగానే అన్నా రాయన: 'రంగమ్మకి మాటిచ్చాను.'

ఆత్రుతగా ఏమని??' అన్నాను.

'నేనిక తన జోలికి రానని, బంగారమ్మని సరిగా చూస్తానని.'

'మీకింత దయాదాక్షిణ్యాలు ఎందుక్కలి గేయో?!'

ప్రశ్న కాదిది, హేళన.

'ఆరోజు—బంగారమ్మగారిని చూడమంటూ మీ దగ్గరికి పరిగెట్టుకొచ్చినప్పుడు టైముకి ఓ అరగంట ముందు —వూరిచివర మామిడితోపు గుండా వస్తున్నాను అనుకోకుండా. ఆ చెట్టు దగ్గరికి నేను రావడం మరొక్క నిముషం ఆలస్యమైతే మనందరి బతుకులూ ఇంకోలా ఉండేవి.... అని ఏవో బరువైన తలపుల్లో పడి పోయారు—కళ్ళు మూసుకుని.

ఆయన చెయ్యి మంచం మీదున్న వెండి కుంకం బరిణని అందుకుంది.

'నా ప్రేమ భరించలేక ఒహాళా, నా ఉపేక్ష భరించలేక ఇంకొహాళా ప్రాణాలు తీసుకునేం దుకు సిద్ధ పడ్డారు.

నన్ను తిట్టవలసిందే డాక్టరు గారూ, తిట్ట డమే కాదు.....' అంటూ ఉంటే ఆయన కంఠం గద్గదిక మైంది.

కన్నీళ్లే కాదు, కొంత కుంకమూ ఒలికింది, ఆయన బట్టలపై చెయ్యి వణికి.

భావోద్వేగం ఆయన నోరు నొక్కెయ్యగా ఉత్కంఠా, వ్యధా భరించ లేక చచ్చి పోతున్నాను నేను.

'పుల్లంరాజుగారూ.........'

'... ...'

హఠాత్తుగా లేచి ఆయన్ని కుదుపుతూ 'పుల్లం రాజుగారూ ఏం జరిగింది చెప్పండి మీరా చెట్టు దగ్గరికి వెళ్లేక.....ఏం జ.....'

ఆయన తేరుకుని బదులు పలికారు.

'ఏం జరుగుతుంది!...అడుగుల చప్పుడు విని తుళ్లిపడి నావైపు తిరిగింది. బండరాయెక్కి కొమ్మకి ఉరితాడు కట్టుకుంటున్న రంగమ్మ.

అంతే మరి వినపడ లేదు నాకు. జ్ఞానేంద్రియాల తలుపులు ధాంమని వేసి నా మెదడు గిర్రున తిరుగుతున్నట్టునిపించింది. ★


# పసిబిడ్డకు పళ్లు వచ్చునప్పటి బాధను సులువొనర్చుటకు
## పిరమిడ్ గ్లిసరీన్



మెత్తని గుడ్డపీలికను మీ వ్రేలికి చుట్టుకోండి, దానిని పిరమిడ్ గ్లిసరీన్‌లో ముంచి దానితో పసిబిడ్డ పను చిగుళ్ల మీద మెల్లగా రుద్దండి, తక్షణం శమనమగును. దాని తియ్యని ప్రీతిప్రద రుచిని పిల్లలు ఇష్టపడతారు,

శుద్ధమైన, ఆరోగ్యకరమగు పిరమిడ్ గ్లిసరీన్ [illegible] సౌందర్యకారిగాను, [illegible] ఇంట్లో అనేక విధములుగాను ఉపయుక్తమైనది. ఒక సీసా దగ్గరుంచుకోండి!

ఉచితం ఈ కూపన్ పూరించి హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్, పోస్టుబాక్సు నం. 409, బొంబాయి 1. కు పోస్టుద్వారా పంపండి.

పిరమిడ్ గ్లిసరీన్ ఇంట్లో వుపయోగించే విధమును తెలిపే ఆంగ్లము/హిందీ • భాషలోగల ఉచితకర పత్రమును దయచేసి నాకు పంపండి,

నా పేరు, చిరునామా ______

• అక్కరలేని భాషను కొట్టివేయండి

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి



PYG. 16-X60 TL